# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 295 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది.
- ❖ ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల ఎన్డీయే కూటమి అధికారిక పగ్గాలు చేపట్టనుంది.
- ❖ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఈరోజు సాయంత్రం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కలవనున్నారు.
- ❖ నైరుతి ఋతుపవనాల ప్రభావంతో రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

==========================

సార్వత్రిక ఎన్నికల-2024 ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 543 లోక్ సభ స్థానాలకు గాను, భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 295 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ప్రభుత్వం ఏర్పాటుకు కావాల్సిన 272 స్థానాల కంటే ఎక్కువ స్థానాల్లో ఆధిక్యం కొనసాగుతుండడంతో వరుసగా మూడవ సారి ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం లాంఛనమే. బీజేపీ సీనియర్ నాయకులు నరేంద్రమోదీ వారణాసి లోక్ సభ స్థానం నుంచి ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఈ ఫలితాలు అన్నింటినీ ఎన్నికల సంఘం అధికారికంగా ధృవీకరించలవలసి ఉంది.

==========================

ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల ఎన్డీయే కూటమి అధికారిక పగ్గాలు చేపట్టనుంది. 175 స్థానాలు కలిగిన శాసనసభలో ప్రభుత్వం ఏర్పాటుకు 88 స్థానాలు అవసరం. కాగా, ప్రస్తుతం అందిన ఫలితాల ప్రకారం ఈ కూటమిలో 77 స్థానాల్లో తెలుగుదేశం, 15 స్థానాల్లో జనసేన, 6 స్థానాల్లో బీజేపీ గెలుపొందింది. ప్రభుత్వం ఏర్పాటు

దిశగా ఎన్డీయే కూటమి ముందుకు వెళుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 11 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా పలువురు మంత్రులు ఓటమి దిశగా పయనించడం గమనార్హం. ఈ ఫలితాలు అన్నింటినీ ఎన్నికల సంఘం అధికారికంగా ధృవీకరించలవలసి ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపులో తెలుగు దేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కూటమి అభ్యర్థులు భారీ ఆధిక్యత కనబరుస్తున్నారు. మొత్తం 175 శాసనసభ స్థానాలలో టీడీపీ 144 చోట్ల, జనసేన 21 చోట్ల, భారతీయ జనతా పార్టీ 10 స్థానాలలో కూటమిగా ఏర్పడి పోటీ చేసిన విషయం తెలిసిందే. విజయవాడ లోక్ సభ నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కేశినేని శివనాథ్ 40 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో వున్నారు. రాజమహేంద్రవరం రూరల్ శాసన సభ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి 50 వెలకు పైగా ఆధిక్యంలో వున్నారు. రాజమహేంద్ర వరం లోక్ సభా స్థానంలో బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి లక్షకు పైగా ఓట్ల ఆధిక్యం కనబరచడం గమనార్హం. కడపటి సమాచారం మేరకు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ 15 స్థానాలలో మాత్రమే ఆధిక్యంలో వుంది. నిబంధనల ప్రకారం  ప్రతిపక్ష హోదాకు 18 స్థానాలు రావలసి వుంటుంది. సొంతంగా 88 స్థానాలు సాధించిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. ఇలా వుండగా పలువురు రాష్ట్ర మంత్రులు, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు సైతం వెనుకబడి వుండడం గమనార్హం.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 శాసనసభ స్థానాలకు గానూ, 13 స్థానాల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. విశాఖ తూర్పు శాసనసభ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి పివీజీఆర్ నాయుడు (గణబాబు), ఉత్తర నియోజకవర్గంలో భారతీయ జనతపార్టీ అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు, దక్షిణ నియోజకవర్గంలో వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్, భీమిలి నియోజకవర్గంలో గంటా శ్రీనివాసరావు, గాజువాకలో పల్లా శ్రీనివాసరావు, పెందుర్తిలో జనసేన పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు, అనకాపల్లిలో కొణతాల రామకృష్ణ, యలమంచిలిలో సుందరపు విజయకుమార్‌లు విజయం సాధించారు. ఇదిలా ఉండగా విశాఖ లోక్ సభ స్థానం నుంచి ఎన్డీయే కూటమి అభ్యర్థి మతుకుమల్లి శ్రీ భరత్ తన సమీప వైసీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీపై సుమారు 44వేల ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు.  అలాగే అనకాపల్లి లోక్ సభ స్థానం నుంచి ఎన్డీయే కూటమి అభ్యర్థి సీఎం రమేష్ తన సమీప వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడుపై ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అదేవిధంగా అరకు లోక్ సభ స్థానం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుమ్మా తనూజారాణి తన సమీప ఎన్డీయే కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీతపై సుమారు 54 వేల ఆధిక్యంలో ఉన్నారు. ఈ ఫలితాలు అన్నింటినీ ఎన్నికల సంఘం అధికారికంగా ధృవీకరించలవలసి ఉంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈరోజు సాయంత్రం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కలవనున్నారు. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో వెస్సార్ సీపీ ఓటమి పాలవడంతో ముఖ్యమంత్రి పదవికి ఆయన రాజీనామా చేయనున్నారు. తదుపరి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి వీలుగా తన రాజీనామా లేఖను రాజ్‌భవన్‌లో గవర్నర్ కు సమర్పించనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవణ్ కళ్యాణ్ పిఠాపురం శాసనసభ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. తన సమీప వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధిని వంగా గీతపై 70 వేల 279 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఆయన నేతృత్వంలోని జనసేన పార్టీ అభ్యర్థులు 20 శాసనసభ  స్థానాల్లో విజయం సాధించారు. అలాగే కాకినాడ, మచిలీపట్నం

లోక్‌సభ నియోజకవర్గాల జనసేన అభ్యర్థులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, వల్లభనేని బాలశౌరిలు ఆధిక్యం దిశలో కొనసాగుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలంగాణ లోక్ సభ ఎన్నికల ఫలితాలు ఆసక్తి కరంగా సాగుతున్నాయి. మొత్తం 17 లోక్ సభ స్థానాలకు గాను భారతీయ జనతా పార్టీ 8 స్థానాల్లోనూ, కాంగ్రెస్ పార్టీ 8 స్థానాల్లోనూ ఆధిక్యంలో ఉన్నారు. మరొక స్థానమైన ఛాంద్రాయణగుట్ట లోక్ సభ స్థానం నుంచి అసదుద్దీన్ ఒవైసీ ముందంజలో కొనసాగుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి ఋతుపవనాల ప్రభావంతో రేపు ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలియజేస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత ఐదేళ్లలో ప్రజలకి అన్ని రకాలుగా ఉండగా ఉన్నామని, ఈ ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. అలాగే గెలుపొందిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరం జిల్లాలో 9 శాసనసభ స్థానాలకు గానూ, 9 స్థానాల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులు విజయం దిశగా పయనిస్తున్నారు. ఇందులో భాగంగా తెలుగు దేశం పార్టీ మాజీ మంత్రి, చీపురుపల్లి శాసనసభ సభ్యులు కిమిడి కళావెంకటరావు వైఎస్సార్ సీపీ సమీప అభ్యర్థి బొత్స సత్యనారాయణపై ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి 231 లోక్ సభ స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతుంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, వాయినాడ్, రాయబరేలీ రెండు లోక్ సభ స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అమేథీ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి కిశోర్ లాల్ శర్మ కేంద్ర మంత్రి స్మృతి ఇరాణీపై విజయం సాధించారు. ఇండియా కూటమిలో భాగమైన తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ 37 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ వస్తుండడంతో ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. కూటమిలోని భాగస్వామ్య పక్షాలతో రేపు సమావేశం కావాలని బీజేపీ జాతీయాధ్యక్షులు జేపీ నడ్డా కూటమి పార్టీల అధినేతలకు ఆహ్వానం అందించారు. ముఖ్యంగా నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ, చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమిలో కీలకపాత్ర పోషించనున్నాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ 16 స్థానాల్లో, జేడీయూ 14 స్థానాల్లో విజయం సాధించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జులై 28న జరగనున్న గ్రూప్-2 ప్రధాన పరీక్ష రాయబోయే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలు, జిల్లా, జోనల్ పోస్టుల వివరాలను ప్రాధాన్య క్రమంలో నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్- ఏపీపీఎస్సీ తెలిపింది. రేపటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు నమోదుకు అవకాశం కల్పించినట్లు ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో వెల్లడించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీకాకుళం జిల్లాలో 9 శాసనసభ స్థానాలకు గానూ, 8 స్థానాల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇందులో భాగంగా తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి అభ్యర్థి కింజరాపు అచ్చెంనాయుడు తన సమీప అభ్యర్థి డి. శ్రీనివాస్‌పై విజయం సాధించారు. శ్రీకాకుళం లోక్ సభ నియోజకవర్గం నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమీప అభ్యర్థి పేరాడ తిలక్‌పై గెలుపొందారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరించుకోవచ్చని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వై.గోపాల కృష్ణ తెలిపారు. గుంటూరులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్య వర్తిత్వంపై రెండో విడత శిక్షణ తరగతులని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల నుంచి ఎంపిక చేసిన న్యాయాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈనెల 7వ తేదీ వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరిచుకునే ప్రక్రియను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వ చట్టం-2023లో పలు మార్పులు చేసిందని వివరించారు. ఈ చట్టం త్వరలోనే అమల్లోకి వస్తుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిసా శాసనసభ ఫలితాలు విడుదలయ్యాయి. మొత్తం 147 శాసన సభ స్థానాలకు గాను భారతీయ జనతా పార్టీ 80 స్థానాల్లోనూ, బిజు జనతాదల్ 49 స్థానాల్లోనూ, కాంగ్రెస్ 14 స్థానాల్లోనూ ఆధిక్యం కొనసాగిస్తున్నాయి. బీజేపీ అధికారం చేపట్టేందుకు కావాల్సిన ఆధిక్యాన్ని సాధిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గాన గంధర్వుడు ఎస్.పీ.బాలసుబ్రహ్మణ్యం జయంతి ఈరోజు. తెలుగు సినీ సంగీత ప్రపంచంలో ఆయనకు ముందు, తర్వాత అనేంతగా తెలుగుతో పాటు దక్షిణాది చలన చిత్ర ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం 1946 జూన్ 4వ తేదీన అప్పటి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కోనేటమ్మపేట గ్రామంలో జన్మించారు. శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న చిత్రం ద్వారా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టారు. తమిళ, కన్నడ, మలయాళ, హిందీ తదితర భాషల్లో వేలాది పాటలు పాడారు. సాగర సంగమం, స్వాతిముత్యం, రుద్రవీణ చిత్రాలకు జాతీయ అవార్డులు అందుకొన్నారు. 40 వేలకు పైగా పాటలు 11 భాషలలోపాడి, 40 సినిమాలకి సంగీత దర్శకత్వం వహించి ప్రపంచంలోనే ఒక అరుదయిన రికార్డు ఆయన సొంతం చేసుకున్నారు. ఉత్తమ గాయకుడిగా ఆరుసార్లు జాతీయ అవార్డు.. కేంద్రం ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ... పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. ఆయన మరణానంతరం కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ ప్రదానం చేసింది. తన అమృత గానంతో దశాబ్దాల పాటు ప్రజలను రంజింపజేసి 2020 సెప్టెంబర్ 25న 74 ఏళ్ల వయసులో దివంగతులయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి విజయం దిశగా పయనిస్తుండడంతో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లోని లోక్‌సభ స్థానాల్లో తెలుగుదేశంపార్టీ అభ్యర్థులు గుంటూరు నియోజకవర్గం నుంచి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేటలో లావు శ్రీకృష్ణదేవరాయులు, నెల్లూరు నుంచి వి.ప్రభాకర్‌రెడ్డిలు, అమలాపురంలో జీఎం హరీష్, ఏలూరులో పి.మహేష్‌కుమార్, బాపట్లలో టి.కృష్ణప్రసాద్‌లు ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో భూతాపాన్ని పెంచిన సహజ సిద్ధ ఎల్ నినో పరిస్థితి ముగుస్తోందని ప్రపంచ వాతావరణ సంస్థ  డబ్ల్యుఎం.ఓ తెలిపింది. ఎల్ నినో స్థానంలో వచ్చే జులై - సెప్టెంబర్ నెలలలో లా నినో ఏర్పడడానికి అవకాశాలు కనబడుతున్నాయని, దీని వల్ల రుతుపవనాల సీజన్ లో మంచి వర్షాలు కురవడానికి సానుకూల పరిస్థితులు వున్నాయని ఆ సంస్థ తన తాజా నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ అత్యంత ఉష్ణమయ మాసంగా రికార్డు సృష్టించిందని, అంతకు ముందు వరుసగా పది నెలలలోనూ ఇదే పరిస్థితి నెలకొందని తెలిపింది. గత 13 నెలలలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయని, ఇందుకు ఎల్ నినో పరిస్థితి ప్రధాన కారణమని డబ్ల్యుఎం.ఓ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =